# భాష అభివృద్ధికి మార్గదర్శిని



# భాష అభివృద్ధిలో కుటుంబం పాత్ర

- పిల్లలు భాషను నేర్చుకునేందుకు అనుకూలమైన వాతావరణంలోనే మాట్లాడడం, ఇతరులతో సంభాషించడం నేర్చుకుంటారు.

- పిల్లలు కొత్త పదాలను నేర్చుకోవడానికి, తమ పదజాలాన్ని పెంచుకోవడానికి ప్రోత్సహించేలా ఇంటి వాతావరణాన్ని ఏర్పాటుచేయడం చాలా ముఖ్యం.

- పిల్లల ప్రారంభ ఎదుగుదల దశలో వారు ఎక్కువ సమయం కుటుంబ సభ్యులతోనే గడుపుతారు. అందువల్ల, వారి భాషాభివృద్ధిలో కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో కీలకమైనది.

- భాషను నేర్చుకోవడం అంటే కేవలం టేబుల్ వద్ద కూర్చొని చదవడం మాత్రమే కాదు. ఆటల ద్వారా, అలాగే రోజువారీ పనుల  ద్వారా కూడా పిల్లలు సహజంగానే భాషను నేర్చుకుంటారు.



# భాష అభివృద్ధిలో కుటుంబం పాత్ర

- పిల్లల చుట్టూ ఒకేసారి అనేక భాషల మిశ్రమం కాకుండా, ప్రధానంగా ఒకే భాష వినిపించేలా ఉండటం కూడా చాలా ముఖ్యం. ఇలా చేయడం వల్ల పిల్లలు ఆ భాషను సులభంగా అర్థం చేసుకుని నేర్చుకోగలుగుతారు.

- ఉదాహరణకు: ఇంట్లో ఒకేసారి హిందీ, తెలుగు భాషలను కలిపి ఎక్కువగా మాట్లాడితే, పిల్లలకు ఏ భాషను నేర్చుకోవాలో అర్థం చేసుకోవడం కొంత కష్టంగా ఉండవచ్చు. అందువల్ల, పిల్లలు ఎక్కువ సమయం గడిపే వాతావరణంలో ప్రధానంగా ఒకే భాషను ఉపయోగించడం అవసరం.



# తల్లిదండ్రులకు అవసరమైన ముఖ్యమైన నైపుణ్యాలు

మీ పిల్లలు చేసే పనులను గమనించి, వాటికి స్పందించండి.

మీ మాటలకు ముఖ కవళికలను జోడించండి. అలాగే, "ఓ!", "చాలా బాగా చేశావు!", వంటి ప్రశంసలతో వారిని ప్రోత్సహించండి.

మీ పిల్లలను మాట్లాడటానికి ప్రోత్సహించేలా వారికి ప్రశ్నలు అడుగుతూ సంభాషణను కొనసాగించండి.

రైమ్స్ ఆటలు మరియు ఇతర సరదా కార్యకలాపాల ద్వారా పిల్లలకు భాషను నేర్పండి

మీరు మాట్లాడేటప్పుడు మీ పిల్లల దృష్టి మీపై ఉండేలా చూసుకోండి.

పిల్లలు ఒక వస్తువు పేరును చెబితే, దానిని పలుమార్లు పునరావృతం చేయండి.

'నువ్వు తప్పు' అని చెప్పకుండా సరైన సమాధానం చెప్పండి.

ఎప్పుడూ నేర్చుకోవడాన్ని ఆనందదాయకంగా మార్చే ప్రయత్నం చేయండి!

# భాషాభివృద్ధికి కార్యకలాపాలు




- సూచన ఇవ్వడం (ప్రాంప్టింగ్): మీ పిల్లలు ఏదైనా పని చేస్తున్నప్పుడు ఉదాహరణకు మీవైపు నడుస్తున్నప్పుడు ఆ పనిని వివరిస్తూ “నడువు” అని చెప్పండి.

- పిల్లలకు సులభమైన సూచనలు ఇవ్వండి. వారు ఆ సూచనలను పాటించకపోతే, వారికి సహాయం చేస్తూ ఆ పనిని చేయించండి.

- ఉదాహరణకు, “నిలబడు”  అని చెప్పండి. వారు నిలబడకపోతే, మీరు సహాయం చేస్తూ నిలబెట్టండి, అదే సమయంలో సరదాగా “నిలబడు” అని చెప్పండి.

- కొంతకాలానికి , పిల్లలు ఆ పదాలను నేర్చుకున్నప్పుడు, సూచనలను కొంచెం కొంచెంగా తగ్గించండి. పిల్లలు పూర్తిగా ఆ పదాన్ని నేర్చుకున్న తర్వాత, సూచనలను పూర్తిగా ఆపివేయండి.

# అనుకరణ చేయండి మరియు చెప్పండి

- మీ పిల్లలకు ఆసక్తి ఉన్న పనిని వారు చేసిన విధంగానే మీరు కూడా **అనుకరణ చేయండి**.
- ఉదాహరణకు: పిల్లలు బంతిని విసిరితే, మీరు కూడా అదే విధంగా మరో బంతిని విసరండి.

- మీరు ఆ పని చేసిన వెంటనే, ఆ పనిని మాటల్లో **చెప్పండి**. సరదాగా ఆ పనిని వివరిస్తూ చెప్పండి.
- ఉదాహరణకు: బంతిని విసురుతున్నప్పుడు "బంతిని విసురు" అని చెప్పండి. మీ పిల్లలు నేర్చుకోవాలని మీరు కోరుకునే పదాన్ని కొంచెం స్పష్టంగా, నొక్కి చెప్పండి.

- మీ పిల్లలను కూడా అదే పనిని మళ్లీ చేయమని ప్రోత్సహించండి. వారు ఆ పని చేస్తున్నప్పుడు, ఆ పదాన్ని మళ్లీ చెప్పండి. వారు మిమ్మల్ని అనుసరించినప్పుడు "వావ్!" వంటి ప్రశంసలతో వారిని ప్రోత్సహించండి.



# చిత్రాలతో కూడిన పుస్తకాలను చదివించడం

- పెద్ద పరిమాణంలో స్పష్టమైన చిత్రాలున్న, పిల్లలు రోజూ చూసే వస్తువులు లేదా చేసే పనులను చూపించే చిత్రాలతో కూడిన పుస్తకాలను ఉపయోగించండి. పత్రికలు, మ్యాగజైన్‌లలోని చిత్రాలను కత్తిరించి లేదా ప్రింట్ చేసిన చిత్రాలతో కూడా మీరు ఒక చిన్న పుస్తకాన్ని తయారు చేసుకోవచ్చు.

- పిల్లలతో కలిసి పుస్తకం చదివేటప్పుడు, చిత్రాలను చూపిస్తూ వాటి పేర్లు చెప్పండి. అదే విధంగా వారు కూడా చూపించి చెప్పేలా సహాయక సూచనలు ఇవ్వండి.

- కొంతకాలానికి, పదం మొత్తం చెప్పకుండా మొదటి అక్షరం చెప్పండి. అప్పుడు పిల్లలు మీరు ప్రారంభించిన పదాన్ని పూర్తిగా చెప్పేందుకు ప్రయత్నించేలా ప్రోత్సహించండి.



# ‘WH’ (ఏమిటి/ఎప్పుడు/ఎవరు/ఎలా/ ఎందుకు) ప్రశ్నలు



- ఇది పిల్లలతో ఆడే ఒక సరదా ఆట. ఇందులో మీ చుట్టూ ఉన్న వివిధ వస్తువులను చూపిస్తూ ‘WH’ ప్రశ్నలు అడగండి.
- ఉదాహరణకు, ఒక వస్తువును చూపిస్తూ "ఇది ఏమిటి?" అని ముఖ కవళికలు ద్వారా  అడుగుతూ పిల్లలు సమాధానం చెప్పేలా ప్రోత్సహించండి. పిల్లలు సరైన సమాధానం చెబితే (ఉదాహరణకు: "కారు" ,అని చెబితే,  "అవును! ఇది కారు!" అని)  ప్రశంసించండి.
- అదే ప్రశ్నను వివిధ రకాలుగా కూడా అడగవచ్చు. ఉదాహరణకు: ఇది ఎవరు?, అది ఏమిటి?, కారు ఎక్కడ ఉంది?, ఇది ఏ రంగులో ఉంది?

# వస్తువుల ఉపయోగాలను నేర్పించడం



- మీ పిల్లలు కొన్ని వస్తువుల పేర్లు నేర్చుకున్న తర్వాత, ఆ వస్తువుల ఉపయోగం కూడా నేర్పించడం ముఖ్యం.
- దీని కోసం, వస్తువు చిత్రాన్ని చూపిస్తూ "ఇది..." లేదా "దీనితో..." అనే విధంగా దాని ఉపయోగాన్ని వివరించండి.
- ఉదాహరణకు:
  - బంతి – ఇది విసిరి ఆడుకునేది.
  - పిల్లి – ఇది "మ్యావ్" అంటుంది.
  - చెంచా – దీనితో తింటాం.

# విశేషణాలు లేదా వర్ణనాత్మక పదాలు నేర్చుకోవడం

- మీ పిల్లలు కొన్ని పదాలను నేర్చుకున్న తర్వాత, వస్తువులు లేదా వ్యక్తులను వివరించే పదాలు (విశేషణాలు) కూడా నేర్పించడం ప్రారంభించండి.

- మొదట సులభమైన పదబంధాలతో ప్రారంభించండి. ఉదాహరణకు: చెట్టు పొడవుగా ఉంది, చిన్న బాబు / చిన్న పాప, ఎర్ర కారు
- పిల్లలు కొన్ని వర్ణనాత్మక పదాలు నేర్చుకున్న తర్వాత, వారికి ప్రశ్నలు అడగండి. ఉదాహరణ: ఒక బంతిని చూపిస్తూ "ఇది ఏమిటి?" అని అడగండి. పిల్లలు "బంతి" అని చెప్పిన తర్వాత, "బంతి రంగు ఏమిటి?" అని అడగండి. తర్వాత "ఎరుపు బంతి" అని చెప్పి, అదే పదాన్ని పిల్లలు కూడా చెప్పేలా ప్రోత్సహించండి.

- గుర్తుంచుకోండి:పిల్లలు ప్రయత్నించిన ప్రతిసారి ప్రశంసలతో వారిని ప్రోత్సహించండి. వారికి ఇష్టమైన చిన్న బహుమతి లేదా ఇష్టమైన ఆటతో ప్రోత్సాహం ఇవ్వడం వల్ల వారు మరింత ఉత్సాహంగా నేర్చుకుంటారు.

# వస్తువులను వర్గీకరించడం



- కొన్ని వస్తువులను తీసుకుని, రెండు పెట్టెల ముందు ఉంచండి. ఒక్కో పెట్టెకు ఒక రకం పని లేదా వివరణను ఇవ్వండి.
- ఉదాహరణకు: ఒక పెట్టెలో ఉల్లిపాయలు, మరొక పెట్టెలో బంగాళాదుంపలు ఉంచండి.
    - కొన్ని ఉల్లిపాయలు, బంగాళాదుంపలను పెట్టెల అవతల ఉంచి, వాటిని సరైన పెట్టెలో వేయమని పిల్లలను ప్రోత్సహించండి.
    - మొదట మీరు కొన్ని వస్తువులను స్వయంగా వర్గీకరిస్తూ చూపించండి. ఉదాహరణకు, ఒక ఉల్లిపాయను చూపిస్తూ "ఇది ఏమిటి?" అని అడగండి. పిల్లలు "ఉల్లిపాయ" అని చెప్పితే, "అవును, ఇది ఉల్లిపాయ." అని చెప్పి ఉల్లిపాయల పెట్టెలో వేయండి.
    - ఇదే విధంగా బంగాళాదుంపతో కూడా చేయండి.
- ఆ తర్వాత పిల్లలను కూడా వస్తువులను గుర్తించి, సరైన పెట్టెలో వేయమని ప్రోత్సహించండి.



# వాక్యాలు నేర్పించడం



- మీ పిల్లలు కొన్ని పదాలు మరియు వాటి పనులకు సంబంధించిన పదాలను నేర్చుకున్న తర్వాత, వాటిని ఉపయోగించి సులభమైన వాక్యాలు మాట్లాడడం ప్రారంభించండి. దీన్ని సరదాగా, ఆటలాగా చేయండి.

- ఉదాహరణకు, మీరు తింటున్నప్పుడు, "నేను అరటిపండు తింటున్నాను." అని చెప్పండి. తర్వాత పిల్లలను చూపిస్తూ "నువ్వు అరటి పండు తింటున్నావు." అని చెప్పండి.

- గమనిక: ప్రారంభ దశలో పిల్లలు తమ గురించి "నేను" అని కాకుండా, తమ పేరుతో మాట్లాడవచ్చు. ఉదాహరణకు: "నేను తింటున్నాను." అని కాకుండా "ఆనంద్ తింటున్నాడు." అని చెప్పవచ్చు. ఇది సహజమే. క్రమంగా, "నేను", "నువ్వు" వంటి పదాలు ఉపయోగించేలా ప్రోత్సహించండి.

# గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయాలు

- ప్రారంభ దశల్లో మీరు మీ పిల్లలకు ఎక్కువ పదాలను పరిచయం చేయడం మరియు వారు విన్నప్పుడు ప్రోత్సహించడం చేయాలి. దీనివలన వారికి మాటలతో స్పందించడం క్రమంగా అభివృద్ధి చెందుతుంది.

- కుటుంబ సభ్యులందరూ ఒకే విధంగా పదాలు మరియు భాషను ఉపయోగించాలనే దాని మీద దృష్టి పెట్టండి. ఒకే వస్తువు లేదా పనికి వేర్వేరు పదాలు ఉపయోగించడం పిల్లలకు గందరగోళం కలగవచ్చు.

- మీ పిల్లలకు చాలా పదాలు ఒక్కసారిగా చెప్పకండి. ఇది వారికి ఒత్తిడిగా అనిపించి, ఆ పదాలు ఎక్కువ కాలం గుర్తుంచుకోలేకపోవచ్చు.



